పొద్దంతా ఉల్లిగడ్డలు అమ్మి..
రాత్రివేళ వడ్లను ఎత్తుకెళ్లారు

- సీఐ శ్రీనివాస్‌గౌడ్

విలేకరుల సమావేశంలో మాట్లాడుతున్న సీఐ శ్రీనివాస్‌గౌడ్

గంభీరావుపేట/వీర్నపల్లి,జనవరి 16: పొద్దంతా టాటా ఏసీ ట్రాలీ వాహనాల్లో ఉల్లిగడ్డలు అమ్ముతూ వ్యాపార చేస్తూ రాత్రివేళ గ్రామాల్లో ఆరబోసిన వరి ధాన్యం ఎత్తుకెళ్లారని సీఐ శ్రీనివాస్ గౌడ్ తెలిపారు. మండల కేంద్రంలోని పోలీస్ స్టేషన్‌లో గురువారం ఏర్పాటు చేసుకున్న విలేకరుల సమావేశంలో వారు మాట్లాడారు. భీంగల్, గనపూర్ గ్రామాలకు చెందిన ఇద్దరు వ్యక్తులు రెండు టాటా ఏసీ ట్రాలీ వాహనాల్లో ఉల్లిగడ్డలు అమ్ముతూ వ్యాపారం చేస్తున్నారన్నారు. పొద్దంతా ఉల్లిగడ్డలు అమ్ముతూ రాత్రివేళలో నర్మాల, మల్లారెడ్డిపేట, దమ్మన్నపేట గ్రామాల్లో రైతులు ఆరబోసిన వరి ధాన్యాన్ని ఎత్తుకెళ్లారని సీఐ తెలిపారు. ఆయా గ్రామాల రైతులు ఇచ్చిన ఫిర్యాదు మేరకు దర్యాప్తు ముమ్మరం చేశామన్నారు. వాహనాల తనిఖీల్లో భాగంగా లింగన్నపేట శివారులో వారిని గుర్తించి పట్టుకుని రూ.40 వేల నగదుతోపాటు 40 క్వింటాళ్ల వరి ధాన్యం స్వాధీనం చేసుకున్నామన్నారు. ఈమేరకు కేసు నమోదు చేసి రిమాండ్‌కు తరలించామని సీఐ తెలిపారు. ఈ సమావేశంలో ఎస్ఐ శ్రీకాంత్, ఏఎస్ఐ శ్రీనివాస్‌రెడ్డి, సిబ్బంది ఉన్నారు.

మీ ప్రాణం మీ చేతుల్లో..

- ప్రయాణికులకు అధికారుల అవగాహన

ప్రయాణికులకు అవగాహన కల్పిస్తున్న అధికారులు

చందుర్తి, జనవరి 16: జాతీయ రోడ్డు భద్రతా మాసోత్సవాన్ని పురస్కరించుకొని గురువారం చందుర్తి మండల కేంద్రంలో అవగాహన కార్యక్రమం నిర్వహించారు. ఈ సందర్భంగా మోటార్ వాహన తనిఖీ అధికారి జీ వంశీధర్ సహాయక మోటారు వాహన తనిఖీ అధికారి పృథ్వీరాజ్ వర్మ పలు ద్విచక్ర వాహనదారులకు ఆటో రిక్షాడ్రైవర్లకు రోడ్డు భద్రతా, ప్రయాణంపై జాగ్రత్తలు తెలిపారు. రోడ్డుపై ప్రయాణిస్తున్న ద్విచక్ర వాహన దారులకు హెల్మెట్ లేకుండా ప్రయాణం చేస్తే కలిగే ఇబ్బందులు చట్టరీత్యా తీసుకునే చర్యల గురించి తెలిపారు. ప్రయాణికులను చేరవేసే ఆటోరిక్షా వారికి తగిన సూచనలు, సలహాలు తెలిపారు. మద్యం తాగి, మొబైల్ మాట్లాడుతూ, తోటి ప్రయాణికులతో ముచ్చటిస్తూ డ్రైవర్ సీట్ ఇరుపక్కలా ప్రయాణికులను కూర్చోపెట్టుకోవద్దన్నారు. డ్రైవర్స్ యూనిఫార్మ్‌ను ధరించకపోతే ఫైన్ వేస్తామని ట్రాఫిక్ నిబంధనలు తప్పనిసరిగా పాటించాలని సూచించారు. ఇక్కడ రవాణా శాఖాధికారులు మోటారు వాహన తనిఖీ అధికారి వంశీకృష్ణ సహాయక మోటారు వాహన తనిఖీ అధికారి పృథ్వీరాజ్‌వర్మ కానిస్టేబుల్ ప్రశాంత్ మండల ప్రజలు పాల్గొన్నారు. వాహన తనిఖీలో భాగంగా ఒక వాహనానికి సంబంధిత పత్రాలు లేకపోవడంతో పోలీస్ స్టేషన్‌కు తరలించారు.

పేద కుటుంబానికి ఆర్థిక సాయం అందజేత

బాధిత కుటుంబ సభ్యులకు నగదును అందజేస్తున్న రెడ్డి యూత్ సభ్యులు

కోనరావుపేట, జనవరి 16: మండలంలోని మామిడిపల్లి గ్రామానికి చెందిన లోకుర్తి రజిత అనారోగ్యంతో బాధపడుతుండగా బాధిత కుటుంబ సభ్యులకు రెడ్డి యూత్ సభ్యులు రూ.10వేలు ఆర్థిక సహాయం అందజేశారు. ఈ సందర్భంగా బాధిత కుటుంబ సభ్యులు వారికి కృతజ్ఞతలు తెలిపారు. దాతలు ముందుకు వచ్చి సాయం అందించాలని కోరుతున్నారు. ఇక్కడ రెడ్డి యూత్ అధ్యక్షుడు తీపిరెడ్డి మహేందర్ రెడ్డి, రెడ్డి యూత్ సభ్యులున్నారు.

ప్రకటన

ఇందుమూలముగా సమస్త ప్రజలకు తెలియపరచటం ఏమనగా నా క్లయింట్ శ్రీరామ్ ఫైనాన్స్ లిమిటెడ్, వేములవాడ శాఖ గారు. శ్రీ రామడుగు @ కొమ్ము కీర్తన, W/o శరత్ కుమార్, R/o. ముడపల్లి గ్రామం, చందుర్తి మండలం, రాజన్న సిరిసిల్ల జిల్లా గారికి వ్యాపార నిమిత్తం ఋణ సదుపాయం కల్పించుచున్నారు. ఇట్టి విషయములో తన యొక్క స్వంత ఆస్తి అయిన ఖాళీస్థలం, దీని యొక్క ప్లాట్ నెంబరు: 9, దీని యొక్క విస్తీర్ణం: 152.00 చ.గజాలు, దీని యొక్క సర్వే నెంబరు: 193/D, కొనయిపల్లి H/o, వేములవాడ పట్టణం మరియు మండలం, రాజన్న సిరిసిల్ల జిల్లాలో గల దానిని నా క్లయింట్‌కు పై ఋణ విషయములో తనఖాగా పెట్టి పై ఆస్తికి సంబంధించిన ఒరిజినల్ దస్తావేజులు అప్పగించినారు. కావున ఇట్టి ఆస్తిపై ఎవరికైనా ఎలాంటి హక్కులు కానీ ఆక్షేపనలు కానీ వ్యాజములు ఉన్నచో ఈ ప్రకటన వెలువడిన 7 దినముల లోగా తగు దస్తావేజులతో నా కార్యాలయమునకు వచ్చి సంప్రదించగలరు. లేనిచో ఎవరికి అభ్యంతరాలు లేవని ధృవీకరించబడును.

తేది: 16-01-2025 స్థలము: సిరిసిల్ల.

ఇట్లు: Sd/- సి.హెచ్. మహేశ్ గౌడ్
న్యాయవాది బి.ఎస్సి., ఎల్.ఎల్.బి.,
సిద్దర్థనగర్, సిరిసిల్ల, జి॥ రాజన్న సిరిసిల్ల.

ఇసుక ట్రాక్టర్ పట్టివేత

కోనరావుపేట, జనవరి 16: మండలంలోని వట్టిమల్ల గ్రామానికి చెందిన బాణాల రమేశ్ మూలవాగు నుంచి అక్రమంగా ఇసుక తరలిస్తున్నాడనే సమాచారం మేరకు పట్టుకున్నట్లు ఎస్ఐ ప్రశాంత్ రెడ్డి గురువారం ఒక ప్రకటనలో తెలిపారు. ట్రాక్టర్‌ను పోలీస్‌స్టేషన్‌కు తరలించి కేసు నమోదు చేసినట్లు పేర్కొన్నారు. అనుమతి లేకుండా అక్రమంగా ఇసుక తరలిస్తే కఠిన చర్యలు తప్పవని హెచ్చరించారు.

ప్రకటన

ఇందుమూలముగా సమస్త ప్రజలకు తెలియపరచటం ఏమనగా నా క్లయింట్ శ్రీరామ్ ఫైనాన్స్ లిమిటెడ్, వేములవాడ శాఖ గారు. శ్రీ మంజుల లక్ష్మి, W/o రాజు, R/o. తంగళ్ళపల్లి గ్రామం & మండలం, రాజన్న సిరిసిల్ల జిల్లా గారికి వ్యాపార నిమిత్తం ఋణ సదుపాయం కల్పించుచున్నారు. ఇట్టి విషయములో తన యొక్క స్వంత ఆస్తి అయిన ఖాళీస్థలం, దీని యొక్క విస్తీర్ణం: 184.00 చ.గజాలు, దీని యొక్క సర్వే నెంబరు: 37, తంగళ్ళపల్లి గ్రామం & మండలం, రాజన్న సిరిసిల్ల జిల్లాలో గల దానిని నా క్లయింట్‌కు పై ఋణ విషయములో తనఖాగా పెట్టి పై ఆస్తికి సంబంధించిన ఒరిజినల్ దస్తావేజులు అప్పగించినారు. కావున ఇట్టి ఆస్తిపై ఎవరికైనా ఎలాంటి హక్కులు కానీ ఆక్షేపనలు కానీ వ్యాజములు ఉన్నచో ఈ ప్రకటన వెలువడిన 7 దినముల లోగా తగు దస్తావేజులతో నా కార్యాలయమునకు వచ్చి సంప్రదించగలరు. లేనిచో ఎవరికి అభ్యంతరాలు లేవని ధృవీకరించబడును.

తేది: 16-01-2025 స్థలము: సిరిసిల్ల.

ఇట్లు: Sd/- సి.హెచ్. మహేశ్ గౌడ్
న్యాయవాది బి.ఎస్సి., ఎల్.ఎల్.బి.,
సిద్దర్థనగర్, సిరిసిల్ల, జి॥ రాజన్న సిరిసిల్ల.

ఉద్యోగుల వివరాలు కోరిన ఏసీబీ..!

- గతేడాది ఆగస్టు 22న రాజన్న ఆలయంలో ఏసీబీ అధికారుల తనిఖీలు
- పలు విభాగాల్లో అవకతవకల గుర్తింపు
- ఆందోళనలో ఆలయ ఉద్యోగులు

వేములవాడ, జనవరి 16: వేములవాడ రాజన్న ఆలయంలో ఏసీబీ అధికారుల తనిఖీల నేపథ్యంలో గుర్తించిన అవకతవకలపై ఆ శాఖ ఉన్నతాధికారులు సంబంధిత ఉద్యోగుల వివరాలు అధికారులను కోరినట్లు సమాచారం. అయితే గతేడాది ఆగస్టు 22న రాజన్న ఆలయంలో ఏసీబీ అధికారులు ఆకస్మిక తనిఖీలు నిర్వహించారు. పలు విభాగాల్లో అవకతవకలు గుర్తించిన అధికారులు అప్పుడే సామాజిక మాధ్యమాలు ఎక్స్ ద్వారా వెల్లడించిన విషయం తెలిసిందే. దాదాపు ఆరు మాసాలు కావస్తుండగా రాష్ట్ర ఏసీబీ అధికారులు సంబంధిత విభాగాల ఉద్యోగుల వివరాలను కోరడం రాజన్న ఆలయ ఉద్యోగ వర్గాల్లో ఆందోళన నెలకొంది.

గుర్తించిన తప్పిదాలు ఇవే...!

వేములవాడ రాజన్న ఆలయంలో ఏసీబీ అధికారుల తనిఖీల తరువాత పలు విభాగాల్లో తప్పిదాలను గుర్తించారు. సాక్షాత్తూ ఏసీబీ రాష్ట్ర అధికారులు ఎక్స్ వేదికగా వివరాలు వెల్లడించారు. గోదాంలో జీడిపప్పు, నెయ్యి నిలువల వ్యత్యాసం, టెండర్లలో పాత రేట్లనే కొనుగోలు, రూ.5 లక్షల్లోపు కొనుగోలు చేసే టెండర్లను అంతకుమించి ఉన్న వాటిని తగ్గించి కొనుగోలు చేశారని, తలనీలాలు సమర్పించే భక్తుల నుంచి వసూలు చేసే నగదుతోపాటు తదితర అంశాలను ఆ శాఖ ఎక్స్ ద్వారా పేర్కొన్న విషయం తెలిసిందే. దాదాపుగా ఆరు మాసాలు కావస్తుండగా ఏసీబీ అధికారులు సంబంధిత అధికారుల వివరాలను కోవడంతో ఆలయ ఉద్యోగ వర్గాల్లో ఆందోళన నెలకొంది.

విభాగాల ఉద్యోగుల వివరాలు కోరిన అధికారులు

అవకతవకలు జరిగాయని గుర్తించిన ఏసీబీ అధికారులు సంబంధిత విభాగాల ఉద్యోగుల వివరాలను రాజన్న ఆలయ అధికారులను కోరినట్లు సమాచారం. సంబంధిత విభాగాల ఉద్యోగుల సర్వీస్ రికార్డులను కోరినట్లు తెలిసింది. అయితే తప్పిదాలను గుర్తించిన అధికారులు శాఖాపరమైన చర్యలు తీసుకునేందుకు సంబంధిత దేవాదాశాఖ అధికారులకు సిఫారసు చేస్తారేమోనని రాజన్నఆలయ ఉద్యోగుల్లో ఆందోళన మొదలైంది.

సాధారణ ప్రసవాల సంఖ్య పెంచాలి

- జిల్లా వైద్యారోగ్య శాఖాధికారి ఎస్ రజిత

వైద్యులతో సమావేశంలో మాట్లాడుతున్న డీఎంహెచ్‌వో రజిత

సిరిసిల్ల టౌన్/కలెక్టరేట్, జనవరి 16: ప్రభుత్వ, ప్రైవేటు దవాఖానల్లో సాధారణ ప్రసవాల సంఖ్య పెంచాలని డీఎంహెచ్‌వో రజిత సూచించారు. గురువారం జిల్లా వైద్య, ఆరోగ్యశాఖ కార్యాలయంలో ప్రభుత్వ, ప్రైవేటు హాస్పిటళ్ల గైనకాలజిస్టు వైద్యులతో నిర్వహించిన సమీక్ష సమావేశంలో ఆమె మాట్లాడారు. మొదటి కాన్పులోనే సాధారణ ప్రసవాలు చేయాలని, సీ సెక్షన్ తగ్గిచాలన్నారు. క్లినికల్ ఎస్టాబ్లిష్‌మెంట్ యాక్ట్ నిబంధనను అనుసరించి ప్రైవేటు దవాఖానలు నిర్వహించాలని ఆదేశించారు. పీసీపీఎన్‌డీటీ యాక్టులో భాగంగా రేడియాలజిస్ట్ పేర్లను, సంబంధిత ధ్రువీకరణ పత్రాలు, రికార్డులు అందుబాటులో ఉండేలా చూసుకోవాలన్నారు. సమావేశంలో డాక్టర్ అంజలినా, ప్రభుత్వ దవాఖాన సూపరింటెండెంట్ డాక్టర్ లక్ష్మీనారాయణ, డాక్టర్ పెంచలయ్య, డీసీహెచ్ డాక్టర్ సుగుణ, వైద్యులు నైమా, శోభారాణి, లీలశిరీష, ఉమ, శ్రీవాణి, సత్యనారాయణ, తదితరులున్నారు.

రామానుజమ్మకు ఘన సన్మానం

సిరిసిల్ల టౌన్, జనవరి 16: దక్షిణ ఆసియా అథ్లెట్స్ చాంపియన్‌షిప్‌లో తృతీయ స్థానంలో గెలుపొందిన టమటం రామానుజమ్మను గురువారం సిరిసిల్లలోని ఆమె నివాసంలో తెలంగాణ ఆల్ సీనియర్ సిటిజన్ అసోసియేషన్ జిల్లా అధ్యక్షుడు చేపూరి బుచ్చయ్య ఆధ్వర్యంలో ఘనంగా సన్మానించారు. 70 ఏండ్ల వయసులో క్రీడాస్ఫూర్తిని ప్రదర్శించడం అభినందనీయమని కొనియాడారు. ఈ కార్యక్రమంలో డాక్టర్ జనపాల శంకరయ్య, కోడం నారాయణ, మాదిరెడ్డి అంజనాదేవి, దొంత దేవదాసు, గజ్జెల్లి రాంచంద్రం, తదితరులు పాల్గొన్నారు.

టమటం రామానుజమ్మను సన్మానిస్తున్న సీనియర్ సిటిజన్ అసోసియేషన్ సభ్యులు

ఆర్ఎంపీల క్లినిక్‌లలో అధికారుల తనిఖీలు

- నిబంధనలు ఉల్లంఘిస్తే చర్యలు తప్పవు: జిల్లా వైద్యాధికారిని

ఎల్లారెడ్డిపేట : ఒక క్లినిక్‌లో మందులను పరిశీలిస్తున్న వైద్యాధికారి సరియా అంజుమ్

రాజన్న సిరిసిల్ల, (నమస్తే తెలంగాణ)/ఎల్లారెడ్డిపేట/ముస్తాబాద్/గంభీరావుపేట/రుద్రంగి/వేములవాడ రూరల్/ఇల్లంతకుంట, జనవరి 16:నిబంధనలకు విరుద్ధంగా ఆర్ఎంపీలు నిర్వహిస్తున్న దవాఖానలపై అధికారులు విస్తృత తనిఖీలు నిర్వహించారు. వైద్య ఆరోగ్యశాఖ, పోలీస్, రెవెన్యూ శాఖల ఆధ్వర్యంలో గురువారం జిల్లా వ్యాప్తంగా ఏకకాలంలో అధికార బృందాలు తనిఖీలు చేపట్టాయి. గత నెల 28న గంభీరావుపేట మండలం తుర్కాశిపల్లెకు చెందిన శేక్ ఖాసీంబీ (30)అనే మహిళ ఆర్ఎంపీ చేసిన వైద్యం వికటించి మృతి చెందిన విషయం తెలిసిందే. విచారణ జరిపిన వైద్యాధికారులు సదరు ఆర్ఎంపీ వైద్యుడిపై కేసు నమోదు చేసి, ఆయన నిర్వహిస్తున్న దవాఖానను సీజ్ చేశారు. ఈ నేపథ్యంలో కలెక్టర్‌కు ఆర్ఎంపీలు చేస్తున్న వైద్యంపై ఫిర్యాదులు అందినట్లు సమాచారం. కలెక్టర్ ఆదేశాల మేరకు వైద్యారోగ్యశాఖ నుంచి నలుగురు సిబ్బంది, పోలీస్ శాఖ నుంచి ఎస్ఐ, రెవెన్యూశాఖ నుంచి తహసీల్దార్లు కలిసి 13 మండలాల్లో 13 బృందాలు ప్రతి ఆర్ఎంపీలు నిర్వహిస్తున్న దవాఖాన్లలో విస్తృతంగా తనిఖీలు చేశారు. డిస్ట్రిక్ట్ రిజిస్ట్రేషన్ అథారిటీ సర్టిఫికెట్ ఉన్న వైద్యులు మాత్రమే వైద్యం చేయాల్సి ఉండగా, ఆర్ఎంపీలు నిబంధనలకు విరుద్ధంగా వైద్యం చేస్తున్నారని వైద్యారోగ్యశాఖ జిల్లా అధికారి డాక్టర్ రజిత తెలిపారు. ఇంజక్షన్లు, సెలైన్లు, యాంటీబయాటిక్ మందులు ఇవ్వకూడదని, కేవలం ప్రాథమిక చికిత్స మాత్రమే చేయాలని తనిఖీల సందర్భంగా ఆర్ఎంపీలను సీరియస్‌గా హెచ్చరించామని తెలిపారు. నిబంధనలకు విరుద్ధంగా వైద్యం చేస్తే అందుకు చట్టపరమైన చర్యలు తీసుకుంటామని, క్రిమినల్ కేసులు నమోదు చేస్తామని హెచ్చరించారు. జిల్లా వ్యాప్తంగా ఆర్ఎంపీలు నిర్వహిస్తున్న 18 దవాఖానల్లో తనిఖీలు చేసినట్లు తెలిపారు. ఎల్లారెడ్డిపేట మండలంలోని రెండు క్లినిక్‌లలో వైద్యాధికారి సరియా అంజుమ్, రెవెన్యూ సిబ్బంది తనిఖీలు చేపట్టారు. గొల్లపల్లిలోని ఓ క్లినిక్, మెడికల్ షాపును, ఎల్లారెడ్డిపేట మండల కేంద్రంలోని ఓ క్లినిక్‌లో తనిఖీలు నిర్వహించి సీజ్ చేశారు. ఈ సందర్భంగా వైద్యాధికారిని తనిఖీలపై వివరణ కోరగా సాధారణ తనిఖీల్లో భాగంగా రెవెన్యూ సిబ్బందితో కలిసి రెండు దవాఖానలను తనిఖీ చేశామని ఆమె తెలిపారు. ఇక్కడ సీనియర్ అసిస్టెంట్ సంతోష్, ఆర్ఐ శ్రావణ్, పోలీస్ సిబ్బంది ఉన్నారు. ముస్తాబాద్ మండల కేంద్రంలోని ఆర్ఎంపీ, పీఎంపీల క్లినిక్‌లలో మండల వైద్యాధికారులు, తహసీల్దార్, పోలీసులు ఆకస్మిక తనిఖీలు చేపట్టారు. గంభీరావుపేట మండల కేంద్రంతోపాటు ఆయా గ్రామాల్లోని పీఎంపీ, ఆర్ఎంపీ క్లినిక్‌లను గురువారం రాత్రి రెవెన్యూ, వైద్యాధికారులు తనిఖీ చేశారు. రోగులకు అందిసున్న మందుల వివరాలు, వైద్యుల అర్హతలు తదితర అంశాలపై ఆరా తీశారు. ఇక్కడ వైద్యాధికారి వేణుగోపాల్‌రెడ్డి, తహసీల్దార్ భూపతి, ఎస్ఐ శ్రీకాంత్, సిబ్బంది ఉన్నారు. రుద్రంగి మండల కేంద్రంలోని నాలుగు, మానాలలో రెండు ఆర్ఎంపీ క్లినిక్‌లలో తహసీల్దార్ శ్రీలత, ఎస్ఐ అశోక్ ఆధ్వర్యంలో రెవెన్యూ, పోలీస్ శాఖాధికారులు తనిఖీ చేశారు. ఇక్కడ రెవెన్యూ, పోలీస్ శాఖాధికారులున్నారు. వేములవాడ రూరల్ మండలం వట్టెంల గ్రామంలోని ఆర్ఎంపీ క్లినిక్‌లో పోలీసులు తనిఖీ చేశారు. ఆర్ఎంపీ వైద్యుడు ప్రశాంత్‌ను నిర్వహిస్తున్న క్లినిక్‌లోని మందులను వైద్య బృందం పరిశీలించింది. అనుమతులు లేకుండా నిర్వహిస్తున్న క్లినిక్‌ను సీజ్ చేసినట్లు వేములవాడ రూరల్ పోలీసులు వెల్లడించారు. ఇల్లంతకుంట మండల కేంద్రంలో గురువారం సాయంత్రం వరకు అనుమతి లేని 3 క్లినిక్‌లను సీజ్ చేస్తున్నట్లు తహసీల్దార్ ఫారుఖ్ తెలిపారు. ఇక్కడ మండల వైద్యాధికారులు శరణ్యజ జీవన జ్యోతి, సీఐ మొగిలి, ఎస్ఐ శ్రీకాంత్‌గౌడ్ తదితరులున్నారు. వీర్నపల్లి మండల కేంద్రంలో ఎలాంటి అనుమతులు లేకుండా ఆర్ఎంపీ రాజు నిర్వ హిస్తున్న మణికంఠ క్లినిక్‌ను మండల వైద్యాధికారి సరి యా అంజుమ్ సీజ్ చేశారు. మండలంలోని వివిధ గ్రా మాలకు చెందిన పలువురి ఫిర్యాదు మేరకు తహసీల్దార్ మారుతీరెడ్డి, ఎస్ఐ ఎల్లాగౌడ్, వైద్యాధికారి సరియా అంజుమ్ తన సిబ్బందితో కలిసి తనిఖీ చేశారు. చందుర్తి మండలంలోని కృష్ణంపేట, నర్సింగాపూర్, చందుర్తి, రామన్నపేట గ్రామాల్లో ఆర్ఎంపీ, పీఎంపీ చికిత్స కేంద్రాలపై దాడులు జరిగాయి. కొన్ని గ్రా మాల్లో అనుమతులు లేకుండా ప్రా క్టీస్ నిర్వహిస్తుండగా క్లినిక్‌లను సీజ్ చేశారు. ఈ దాడుల్లో తహసీల్దార్ శ్రీనివాస్, ఎస్ఐ అంజయ్య, వైద్య, రెవెన్యూ సిబ్బంది పాల్గొన్నారు.

ఇల్లంతకుంట : మండల కేంద్రంలో ఒక క్లినిక్‌ను సీజ్ చేస్తున్న మండల అధికారులు

పూర్వ విద్యార్థుల ఆత్మీయ సమ్మేళనం

కోనరావుపేట, జనవరి 16: మండలంలోని బావుసాయిపేట జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాలలో 2008-09 సంవత్సరంలో పదో తరగతి చదివిన పూర్వ విద్యార్థులు మామిడిపల్లి శ్రీ సీతారామస్వామి ఆలయ ఆవరణలో సమావేశమయ్యారు. ఈసందర్భంగా విద్యార్థులు పాఠశాలకు వెళ్లి తాము చదువుకున్న తరగతి గదులను పరిశీలించారు. తరగతి గదిలో చేసిన అల్లరి పనులు, తీపి జ్ఞాపకాలను గుర్తుచేసుకున్నారు. అనంతరం కేక్ కట్ చేసి ఏర్పాటు చేసుకున్న విందులో పాల్గొని రోజంతా ఉత్సాహంగా గడిపారు.

సమావేశమైన పూర్వ విద్యార్థులు

వీర జవాన్ సతీమణికి ఘన స్వాగతం

బోయినపల్లి, జనవరి 16: మండలంలోని మల్కాపూర్ గ్రామానికి చెందిన పబ్బల్ల అనిల్‌కుమార్ ఆర్మీలో జవాన్‌గా పనిచేస్తూ 2023 మే 4న హెలికాప్టర్ ప్రమాదంలో మృతి చెందాడు. ఈ మేరకు భారత సైనిక దినోత్సవం సందర్భంగా ఈనెల 14న పుణెలో సైనికాధికారులు, రక్షణశాఖ మంత్రి అనిల్‌కుమార్‌కు సేవా మెడల్ (గ్యాలంటరీ) అవార్డు ప్రకటించారు. ఈ సందర్భంగా అమర జవాన్ అనిల్‌కుమార్ సతీమణి సౌజన్యకు వీరనారి టైటిల్‌ను బుధవారం అందించారు. ఆమె తన కుమారుడితో ఈ పురస్కారం తీసుకున్న తరువాత ఢిల్లీ నుంచి గురువారం సాయంత్రం స్వగ్రామానికి వచ్చింది. దీంతో మండల కేంద్రంలో ఆమెకు, కుమారుడికి శాలువాలు కప్పి ఘనంగా సన్మానించారు. అనంతరం బోయినపల్లి మండల కేంద్రం నుంచి జాతీయ బీసీ యువజన సంఘం ఆధ్వర్యంలో భారీ ర్యాలీతో గ్రామానికి చేరుకున్నారు. వీర జవాన్ అమర్ రహే అంటూ నినాదాలు చేశారు. ఆర్మీ చీఫ్ అందించిన మెడల్‌ను విగ్రహం మెడలో వేశారు. ఇంటి వద్ద ఆయన చిత్రపటం ఎదుట ఘన నివాళులర్పించారు. కార్యక్రమంలో జాతీయ బీసీ యువజన సంఘం జిల్లా అధ్యక్షుడు దండు వినోద్, బీసీ సంఘాల నాయకులు కనుకయ్య, అనిల్, వెంకటేశ్, బత్తుల మహేందర్ యాదవ్, గ్రామస్తులున్నారు.

బోయినపల్లిలో వీర జవాన్ సతీమణి సౌజన్యను సన్మానిస్తున్న బీసీ సంఘాల నాయకులు

దరఖాస్తుల ఆహ్వానం

కలెక్టరేట్, జనవరి 16: బ్యాంకింగ్, గ్రూప్స్ తదితర పోటీ పరీక్షల కోసం తెలంగాణ ప్రభుత్వం మైనార్టీ సంక్షేమ శాఖ ఆధ్వర్యంలో ఉచిత ఫౌండేషన్ కోర్సుల్లో ప్రవేశం కోసం దరఖాస్తులు ఆహ్వానిస్తున్నట్లు కలెక్టర్ సందీప్ కుమార్ ఝా గురువారం ఒక ప్రకటనలో తెలిపారు. ఆసక్తి గల మైనార్టీ అభ్యర్థులు ఫౌండేషన్ కోర్సులో ప్రవేశం పొందడానికి జిల్లా మైనార్టీ సంక్షేమ కార్యాలయం కలెక్టరేట్‌లోని మొదటి అంతస్తు ఎఫ్ 26లో దరఖాస్తులను సమర్పించాలని పేర్కొన్నారు. కోర్సుల్లో నమోదు చేసుకోవడానికి ఫిబ్రవరి 15 చివరి తేదీ అని ప్రకటించారు. సమాచారం కోసం 9949910328 నంబర్‌లో సంప్రదించాలన్నారు.

'ఉచిత శిక్షణను సద్వినియోగం చేసుకోండి'

ముస్తాబాద్, జనవరి 16 : జిల్లాలోని నిరుద్యోగ యువతకు బీసీ స్టడీ సర్కిల్‌లో ఫిబ్రవరి 15 నుంచి ఆర్ఆర్‌బీ, ఎస్సెస్సీ, బ్యాంకింగ్ రిక్రూట్‌మెంట్ కోసం వంద రోజులపాటు ఉచిత శిక్షణను ఇస్తున్నట్లు, అర్హులైన అభ్యర్థులు సద్వినియోగం చేసుకోవాలని బీసీ స్టడీ సర్కిల్ డైరెక్టర్ జెల్ల వెంకటస్వామి తెలిపారు. ఆసక్తి గల అభ్యర్థులు (WWW.tgbcstudycircie.cgg.gov.in) ద్వారా ఈనెల 20 నుంచి ఫిబ్రవరి 9 వరకు దరఖాస్తులు చేసుకోవచ్చని ఆయన తెలిపారు. గ్రామీణ ప్రాంతంలోని యువత తల్లిదండ్రుల వార్షిక ఆదాయం రూ.1,50,000 పట్టణ ప్రాంతాల్లో ఉండేవారు రెండు లక్షల ఆదాయానికి మించి ఉండరాదని పేర్కొన్నారు. ఎంపిక విధానం ఇంటర్మీడియట్, డిగ్రీ పరీక్షల్లో పొందిన మార్కుల ఆధారంగా రిజర్వేషన్ నియామకం ప్రకారం ఉంటుందన్నారు. అర్హత గల అభ్యర్థులు సర్టిఫికెట్ వెరిఫికేషన్ ఫిబ్రవరి 12 నుంచి 14వ వరకు ఉంటుందన్నారు. వివరాలకు 08723 223004, 9381888746 ఆఫీస్ వేళల్లో సంప్రదించాలని బీసీ స్టడీ సర్కిల్ డైరెక్టర్ వెంకటస్వామి తెలిపారు.

జాతీయ బీసీ సంక్షేమ సంఘం యూత్ అధ్యక్షుడిగా వినోద్ కొనసాగింపు

వేములవాడ రూరల్, జనవరి 16 : జిల్లా జాతీయ బీసీ సంక్షేమ సంఘం యూత్ అధ్యక్షుడిగా దండు వినోద్‌ను కొనసాగిస్తూ జాతీయ బీసీ సంక్షేమ సంఘం అధ్యక్షుడు, రాజ్యసభ సభ్యుడు కృష్ణయ్యయాదవ్ గురువారం ఒక ప్రకటన విడుదల చేశారు. గతంలో యూత్ అధ్యక్షుడిగా కొనసాగుతున్న వినోద్ మరికొంత కాలం కొనసాగుతాడని పేర్కొన్నారు.

రుద్రంగి అభివృద్ధికి కృషి

- ప్రభుత్వ విప్, ఎమ్మెల్యే ఆది శ్రీనివాస్
- రుద్రంగి, మానాలలో పలు అభివృద్ధి పనులకు కలెక్టర్‌తో కలిసి శంకుస్థాపన

అభివృద్ధి పనులకు భూమిపూజ చేస్తున్న ప్రభుత్వ విప్, ఎమ్మెల్యే ఆది శ్రీనివాస్, కలెక్టర్ సందీప్‌కుమార్ ఝా

రుద్రంగి, జనవరి 16: రుద్రంగి మండలాన్ని అన్ని రంగాల్లో అభివృద్ధి పథంలో తీసుకెళ్లేందుకు ప్రత్యేక కృషి చేస్తున్నామని ప్రభుత్వ విప్, ఎమ్మెల్యే ఆది శ్రీనివాస్ అన్నారు. గురువారం రుద్రంగి మండల కేంద్రంతోపాటు మానాల గ్రామంలో రూ.2 కోట్ల 3 లక్షలతో సీసీరోడ్లు, సైడ్ డ్రైనేజీల నిర్మాణాలకు కలెక్టర్‌సందీప్ కుమార్ ఝా, రాష్ట్ర యూనియన్ కోఆపరేటివ్ చైర్మన్ మానాల మోహన్‌రెడ్డి, అధికారులు, నాయకులతో కలిసి ఆయన శంకుస్థాపన చేశారు. ఈ సందర్భంగా విప్ మాట్లాడుతూ, రుద్రంగి మండల కేంద్రంలో అడ్వాన్స్ టెక్నాలజీ సెంటర్(ఏటీసీ) ఏర్పాటుతో మండలంతో పాటు నియోజకవర్గ ప్రజలకు ఉపాధి అవకాశాలు పెంపొందుతాయన్నారు. కార్యక్రమంలో డీఆర్డీవో శేషాద్రి, పీఆర్ ఈఈ సుదర్శన్‌రెడ్డి, డీఈ పవణకుమారి, ఏఎంసీ చైర్మన్ చెలుకల తిరుపతి, తహసీల్దార్ శ్రీలత, ఎంపీడీవో నటరాజ్, ఎస్ఐ అశోక్, ఏఈ మనోహర్, ఏపీఎం రాజు, మాజీ జడ్పీటీసీ గట్ల మీనయ్య, మాజీ సర్పంచ్ తర్రె ప్రభలత నాయకులు, గ్రామస్తులు, మహిళలున్నారు.

డీఎస్ఎఫ్ క్యాలెండర్ ఆవిష్కరణ

వేములవాడ రూరల్, జనవరి 16 : వేములవాడ పట్టణంలోని ఎమ్మెల్యే నివాసంలో డీఎస్ఎఫ్ క్యాలెండర్‌ను ప్రభుత్వవిప్ ఆది శ్రీనివాస్ చేతుల మీదుగా ఆవిష్కరించినట్లు డీఎస్ఎఫ్ జిల్లా అధ్యక్షుడు హరీశ్ పేర్కొన్నారు. డీఎస్ఎఫ్ వ్యవస్థాపక అధ్యక్షుడు ఎరవెల్లి జగన్ ఆధ్వర్యంలో ప్ర భుత్వవిప్ ఆది శ్రీనివాస్ చేతుల మీదుగా క్యాలెండర్‌ను ఆవిష్కరించామన్నారు. కార్యక్రమంలో డీఎస్ఎఫ్ నాయకులు శ్యామ్, రా కేశ్, ప్రదీప్, అరుణ, సోహెల్, శివ, అరవింద్‌తోపాటు తదితరులు పాల్గొన్నారు.

విధులకు ఆటంకం కలిగించిన యువకుడిపై కేసు

సిరిసిల్ల రూరల్, జనవరి 16 : విధులకు ఆటంకం కలిగించిన యువకుడిపై గురువారం కేసు నమోదు చేసి రిమాండ్‌కు పంపినట్లు ఎస్ఐ రామ్మోహన్ తెలిపారు. ఎస్ఐ తెలిపిన వివరాల ప్రకారం, బుధవారం సాయం